'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కుల-జనగణన

దేశంలో జనగణనకు గంట మోగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మొదటిసారి పదహారేండ్ల అసాధారణమైన విరామం తర్వాత మనుషుల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఈసారి జనగణనకు ఎన్నో రకాలుగా ప్రాముఖ్యం ఉన్నది. అందులో అన్నిటికన్నా ముఖ్యమైనది జనగణనతో పాటే కులగణన జరుపడం. 1931లో బ్రిటిష్ పాలనలో చివరిసారిగా కులగణన జరిగింది. అనంతరం ఇక ఇప్పుడు సుమారు 90 ఏండ్ల తర్వాత జనాభాలో ఏ కులం వాటా ఎంతనేది తేలబోతున్నది. దళితబహుజన వర్గాలు కులగణన జరపాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి. 'అధికారంలో మా వాటా మాకు కావాలి.. అందుకు కులగణనే ఏకైక మార్గం' అనేది దీని వెనుక ఉన్న ఆలోచన. కులాలవారీగా లెక్కింపు జరిపితే కులతత్వం పెరిగిపోతుందని అనేవారూ ఉండవచ్చు. కానీ, సామాజిక న్యాయానికి కులగణన తప్పనిసరని చెప్పక తప్పదు. లెక్కలు తీయకుండా అసమానతను సరిదిద్దలేరనేది సామాజిక శాస్త్రవేత్తల వాదన. జాతీయ పార్టీలు కులగణనపై దాగుడుమూతల విధానాలు అనుసరిస్తూ దాటవేస్తూ వస్తున్నాయి. ఇటీవలి కాలంలో కాంగ్రెస్, బీజేపీల వైఖరి గణనీయంగా మారింది. రాజకీయ అవసరాల కోసం రెండు జాతీయ పార్టీలు కులగణనకు తలూపాయనేది వాస్తవం.

ఈ సారి జనగణన కీలకమైన మలుపులో జరుగుతున్నది. 1971 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించిన పార్లమెంటరీ నీట్ల సంఖ్యపై విధించిన యథాతథ స్థితి గడువు ముగియబోతున్న తరుణంలో ఇది జరుగనున్నది. ఈ లెక్కల ఆధారంగా తదుపరి నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు కేంద్రం ఉవ్విళ్లూరుతున్నది. దీనిపై దక్షిణాదిలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత యాభై ఏండ్లలో ఉత్తరాదిలో జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగితే, దక్షిణాదిలో అదుపులో ఉన్నది. కుటుంబ నియంత్రణ పథకం అమలులో ఉత్తర, దక్షిణ వ్యత్యాసాల ఫలితంగా ఇది జరిగింది. జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే యూపీ బలం 100కి చేరుతుంది. దక్షిణాది 4 రాష్ట్రాల ఎంపీ స్థానాలకు ఇది దాదాపుగా సమానం. తమిళనాడు పార్లమెంటు సీట్లు 39 నుంచి 30కి, కేరళ సీట్లు 20 నుంచి 17కు కుంచించుకుపోతాయి. తనకు అనుకూలంగా స్పందించే ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నుంచి లబ్ధి పొందేందుకు బీజేపీ దూకుడుగా పోతుండగా, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఈ సమస్యకు పరిష్కార మార్గాలు వెతకడం అంత సులభం కాదు. ప్రస్తుత ప్రాతినిధ్య శాతాలను మార్చకుండా నీట్ల సంఖ్యను 543 నుంచి 800కు పెంచడం ఓ మార్గంగా కొందరు సూచిస్తున్నారు. రాష్ట్రాల ప్రాతినిధ్యంలో సమతూకం పాటించే అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాల పద్ధతి పాటిస్తే మంచిదని మరికొందరు సూచిస్తున్నారు. ఏదేమైనప్పటికీ ఈసారి జనగణన ఫలితాలు తేనెతుట్టెను కదుపుతాయని చెప్పవచ్చు. కులగణన జరిపి సామాజిక న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి జాతీయ పార్టీలకు లేదనేది స్పష్టం. మొక్కుబడి చర్యలతో, పైపై మార్పులతో సరిపెట్టేందుకే చూస్తాయనే అనుమానాలున్నాయి. అదే గనుక జరిగితే వెనుకబడిన వర్గాల స్పందన ఎలా ఉంటుందనేది ప్రశ్న. నియోజకవర్గాల్లో ఉత్తర, దక్షిణాల మధ్య భారీ వ్యత్యాసాలు ఏర్పడితే రాష్ట్రాల ప్రతిస్పందన ఎలా ఉంటుందనేది మరో ప్రశ్న.

బనకచర్లపై బరిగీద్దాం.. కేసీఆర్‌లా కొట్లాడుదాం!

జలవివాదాలు, జల సంబంధిత యుద్ధాలు ప్రపంచంలో కొత్తేమీ కాదు. అలాగని మన దేశంలోనూ జల వివాదాలకు నేటికీ పరిష్కారం చూపలేదు. నికర, మిగులు, వరద జలాలతో రాష్ట్రాల మధ్య అంతర్యుద్ధాలకు 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో తెరపడకపోవడం విచారకరం. జల వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టడం క్లిష్టమే కావచ్చు కానీ, వివాదాలకెందుకు మోక్షం లభించడం లేదు. పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం ఎందుకు పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నదనేది ఇక్కడ ప్రశ్న.

పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



కేవలం నికరజలాల ఆధారంగా రూపొందించిన ప్రాజెక్టులకే ఇప్పటిదాకా కేంద్రం అనుమతులిస్తున్నది. అదే శాస్త్రీయత, ధర్మం కూడా. శ్రీశైలం, శ్రీరాంసాగర్ సహా అనేక ప్రాజెక్టులను నికర జలాల ఆధారంగానే కట్టారు. వడ్డించేవాడు మనవాడే, ఏ బంతిలో కూర్చుంటే ఏముంది అన్నట్టుగా వరద జలాలతో రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు కడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యమా.. లేదా నియంతృత్వమా? ఈ నేపథ్యంలో నీళ్ల కోసం నిప్పులు పుట్టించిన తెలంగాణ ఉద్యమ గుర్తులను మరోసారి నెమరువేసుకోవాల్సి వస్తున్నది. ఏపీ, తెలంగాణ మధ్య నిప్పు రాజేస్తున్న బనకచర్లపై మరో ఉద్యమానికి బరిగీసి కొట్లాడాల్సిన తరుణం ఆసన్నమైంది.

నదీ జలాలను పంచుకునే విషయంలో సంబంధిత రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఉండాలి. జలాల సమాచారం పారదర్శకంగా ఉండాలి. జల వివాదాలను పరిష్కరించడానికి సమగ్ర విధానాన్ని అనుసరించాలి. కానీ, వీటన్నింటినీ పట్టించుకోకుండా కేంద్రంలో బలం ఉందికదా అని, తెలంగాణపై మరోసారి బాబు కుట్రలు చేస్తున్నారు. ఆయన కుట్రలను తెలంగాణ చూస్తూ ఊరుకోదు కాక ఊరుకోదు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లోని నదుల్లో ప్రవహించే నీటి పరిమాణాన్ని లెక్కించి, నీటి లభ్యతను తేల్చి ఆయా రాష్ట్రాలకు జలాల కేటాయింపులు చేసేందుకు నదీ ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. ఇలా దేశంలో దాదాపు ఎనిమిది ట్రిబ్యునళ్లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఐదు మనుగడలో ఉన్నాయి. కానీ, ఏ ట్రిబ్యునల్, ఏ అంతర్రాష్ట్ర చర్చల్లేకుండా బనకచర్లను నిర్మించే కుట్రకు చంద్రబాబు తెరలేపారు. సాహసం చేశారు. దీన్నిబట్టి తెలంగాణ పట్ల ఆయనకున్న వ్యతిరేక ధోరణిని అర్థం చేసుకోవచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి తెలంగాణలో గోదావరి జలాల వినియోగాన్ని కుట్రపూరితంగా తగ్గించి చంద్రబాబుకు సీఎం రేవంత్ సహకరిస్తున్నారు.

> **ఒక జాతీయ ప్రాజెక్టు చేపట్టాలన్నా, ఆయా రాష్ట్రాలు కేంద్ర జల సంఘం అనుమతితో ప్రాజెక్టులను నిర్మించాలన్నా అన్నింటికంటే ముందుగా రేకెత్తే ప్రశ్న నీటి కేటాయింపులు ఉన్నాయా? అని. ఈ నీటి కేటాయింపులు ట్రిబ్యునల్ ఆధారంగానే జరుగుతాయి. అందుకే ఇప్పటివరకు కేంద్రం అనుమతులు ఇచ్చిన ప్రతి ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ నీటి కేటాయింపులే ప్రామాణికం. కానీ, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, జాతీయ నీటి ప్రమాణాలకు భిన్నంగా చంద్రబాబు చెప్పున్న వృథాజలాల ఆధారిత బనకచర్లకు మోదీ ప్రభుత్వం అనుమతులు ఎలా ఇస్తుంది?**

ఏటా వర్షాకాలంలో సముద్రంలోకి వృథాగాపోతున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నదిపై ఎగువ ప్రాజెక్టుల కారణంగా నీళ్లు సరిగ్గా రావట్లేదు. మరోవైపు గోదావరి నుంచి సగటున ఏటా 2 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. ఇందులో 200 టీఎంసీలను వరదల సమయంలో మళ్లించాలనేది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా ఏపీ ప్రభుత్వం చెబుతున్నది. కానీ, ఇక్కడే ఏపీ సర్కారు కుట్రలు దాగి ఉన్నాయి. గోదావరిలో ఏటా 2 వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయని ఏపీ చెబుతున్నది. కానీ, ఎగువన తెలంగాణ సహా మిగిలిన రాష్ట్రాలకూ ఏపీలాగా వృథా జలాలపై వాటా ఉంటుంది. రాయలసీమలోని 80 లక్షల మందికి తాగునీటితో పాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరందించడం, నాగార్జున సాగర్ కుడి కాలువ, వెలిగొండ, తెలుగు గంగ, గాలేరు నగరి, కేసీ కెనాల్ కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంతో రూ.80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర జల్ శక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. దీనికి ప్రధానమంత్రి కృషి సింఛాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబీపీ) కింద సహాయం అందించాలని కోరుతూ కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇంట్రా స్టేట్ లింక్ (రాష్ట్ర పరిధిలో అనుసంధానం) ప్రాజెక్టు కింద నిధులివ్వాలని కోరారు. దీనిపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సీఎం చర్చించారు.

మూడు దశల్లో గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టనున్నట్టు ఏపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదటి దశలో పోలవరం నుంచి కృష్ణా నదికి జలాలను మళ్లిస్తారు. ఇందుకోసం పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని పెంచుతారు. ప్రస్తుతం కుడికాలువ సామర్థ్యం 17,500 క్యూసెక్కులు ఉండగా, దాన్ని 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. కొత్తగా 25 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోలవరం కుడి కాలువకు సమాంతరంగా వరద కాలువ తవ్వుతారు. రెండో దశలో కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాల్వలో 80వ కిలోమీటరు వద్ద నీటిని కలుపుతారు. ఈ కాలువను 80 కిలోమీటర్ల నుంచి 96.5 కిలోమీటర్ల వరకు సామర్థ్యాన్ని పెంచి జలాలను తరలిస్తారు. మూడో దశలో బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నల్లమల అరణ్యం మీదుగా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తారు. ఇందుకోసం నల్లమల అడవుల్లో 26.8 కిలోమీటర్ల మేర సొరంగం ద్వారా నీటిని మళ్లిస్తారు.

> **మొత్తంగా తొలి దశ పనులకు రూ.13,511 కోట్లు, రెండో దశ పనులకు రూ.28,560 కోట్లు, మూడో దశ పనులకు రూ.38.041 కోట్లు మొత్తంగా రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకోసం 48 వేల ఎకరాల భూసేకరణ జరుపుతున్నారు. ఇందులో 17 వేల ఎకరాల అటవీ భూమి కూడా ఉంది. ఈ బనకచర్ల ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసేందుకు 4 వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమని ప్రభుత్వం ఆ నివేదికలో పేర్కొంది. అంటే పేరుకు గోదావరి నీళ్లే అయినా ఇత్తేసి పొత్తుకూడి కృష్ణా జలాలకు సూటి పెడుతున్నారని చెప్పాలి.**

సముద్రంలో కలిసే వృథా జలాలకు కేంద్రం అనుమతులు ఇచ్చి, నిధులు సమకూరిస్తే భవిష్యత్తులో మిగిలిన రాష్ట్రాలు కూడా సముద్రంలో కలిసే జలాల ఆధారంగానే ప్రాజెక్టులను రూపొందించుకుంటాయి. ఇదే జరిగితే ఎగువ రాష్ట్రాల హక్కుల్ని కాపాడేదెవరు? ప్రధానంగా కృష్ణాలో కూడా ఈ ఏడాది (2024-25) 858 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. 2023-24 నీటి సంవత్సరంలో 72 టీఎంసీలు, 2022-23 నీటి సంవత్సరంలో 765 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. మరి వీటి ఆధారంగా తెలంగాణ గాని, ఇతర రాష్ట్రాలు గాని ప్రాజెక్టుల రూపకల్పన చేస్తే కేంద్రం అనుమతి ఇస్తుందా? కావేరికి గోదావరి జలాలను తరలించాలని కేంద్రం తాపత్రయపడుతున్నది. కేంద్రం బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టే ఇచ్చి కావేరీ అనుసంధానాన్ని తెరపైకి తెస్తే దక్షిణాది రాష్ట్రాల జలాల పంపిణీల్లో మరిన్ని చిక్కుముళ్లు, వివాదాలు రాజుకుంటాయి.

వైఎస్ హయాంలో వరద జలాల ఆధారంగా పోతిరెడ్డిపాడు విస్తరణ జరిగింది. కృష్ణా బోర్డు ముందు ఏపీ పోతిరెడ్డిపాడుకు నీటి కేటాయింపులు ఉన్నట్టు గిరిగీసి మరీ ఏటా వందల టీఎంసీలను శ్రీశైలం నుంచి తరలిస్తున్నది. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్తు కేంద్రంలో కరెంటు ఉత్పత్తి చేస్తే పోతిరెడ్డిపాడుకు నీళ్లు అందడం లేదని, వెంటనే నిలిపివేయాలని బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నది. ఇట్లాగే భవిష్యత్తులో బనకచర్ల, కావేరీకి నీళ్లు సరిపోవడం లేదని, వెంటనే కాళేశ్వరం, దేవాదుల ఎత్తిపోతలను నిలిపివేయాలని ఫిర్యాదులు చేసే పరిస్థితులు కూడా దాపురించే ప్రమాదం ఉంది.

పోలవరంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు ఎగువ రాష్ట్రాలకు కృష్ణాజలాల్లో వాటా పెంచినట్లుగా ఇందులోనూ వాటా ఇస్తారా? అసలు గోదావరిలో శాస్త్రీయంగా ఎంత నీటి లభ్యత ఉన్నది? ఎగువ రాష్ట్రాల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలు ఏమిటనే లెక్కలు తీయాలి. అవన్నీపోగా మిగులు ఉన్నాయని తేలితే బనకచర్లకు కేంద్రం అనుమతులు ఇవ్వాలి. తద్వారా ఆ ప్రాజెక్టుకు ఎంత నీళ్లు కేటాయిస్తారో, అంతమేర కృష్ణా జలాల్లో తెలంగాణకు అదనపు వాటా ఇవ్వాలి.

> **గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు మళ్లించాలన్న ఆంధ్రప్రదేశ్ కుట్రలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తున్నాయి. గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డుకు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి ఈ ప్రాజెక్టు వ్యతిరేకం.**

తమిళనాట రాజకీయ ప్రయోజనాలు పొందాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. దీనిపై కేసీఆర్ హయాంలోనూ కేంద్రంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అనేక సమావేశాలు నిర్వహించింది. అయితే గోదావరిలో ఆయా రాష్ట్రాలు వాడుకోగా మిగులు జలాలుంటే శాస్త్రీయంగా లెక్క తేల్చి, అప్పుడు కావేరీకి తరలించాలని కేసీఆర్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ లెక్కలను ముందు వేసుకోవడం వృథా ప్రయాస అని భావించిన మోదీ ప్రభుత్వం చంద్రబాబును రంగంలోకి దింపింది. ఆ మేరకు చంద్రబాబు వృథా జలాలంటూ బనకచర్ల ప్రాజెక్టును రూపొందించి, గోదావరిని తరలించుకుపోవాలని స్కెచ్ వేశారు. ఇందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భుజంపై తుపాకీ పెట్టి ఏకంగా రాష్ట్ర ప్రయోజనాలనే కాలరాసే కుట్ర జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు విషయంలో ఏపీ ముందుకువెళ్లకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నది. అందుకోసం ఊరూవాడా మరో ఉద్యమ కేంద్రం కావాలి. ప్రతి తెలంగాణ బిడ్డ మరో కేసీఆర్ అవ్వాలి.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)

అభివృద్ధి అంటే జీడీపీ మాత్రమేనా?

జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని మే 25న నీతి ఆయోగ్ ప్రకటించింది. ఆకాశమే హద్దుగా సాగుతున్న భారత వృద్ధికి ఇది నిదర్శనమని కేంద్ర మంత్రులు గొప్పలు చెప్పుకొన్నారు. రెండున్నర నుంచి మూడేండ్లలో జర్మనీని కూడా భారత్ దాటేస్తుందని కూడా అన్నారు. కొన్ని న్యూస్ చానెల్స్ బాకాలూదాయి. సోషల్ మీడియాలో కొందరు 'భక్తులు' ఇది ఆర్థిక విజయమని ట్రెండింగ్ చేశారు. అసలు మనం ఒక్కో మెట్టు ఎందుకు ఎక్కాలి? నేరుగా అమెరికాను కూడా దాటేసి ప్రపంచంలోని అగ్ర ఆర్థిక వ్యవస్థగా మారిందని ఎందుకు ప్రకటించకూడదు? ఏం చెప్పినా నమ్మేవారు ఉన్నారు కదా!

ఆనంద్.టి

జీడీపీ అంటే ఏమిటి? అది ఏం చేస్తుంది? అనేది (భక్తులకు) వారికి తెలియనవసరం లేదు. మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురుగా మారుతున్నదని గర్వంతో ఛాతీ విరుచుకోవడమే వారికి తెలుసు. భవిష్యత్తులో ఏదైనా కారణం వల్ల జర్మనీని అధిగమించడానికి మూడేండ్ల కంటే ఎక్కువ సమయం పడుతుందని చెప్పినా వారు గుడ్డిగా నమ్మేస్తారే తప్ప, ఎప్పటికీ ప్రశ్నించరు. జీడీపీ అనేది దేశపు ఆర్థిక ఆరోగ్యానికి సూచిక. ఇది దేశంలో ఉత్పత్తి అయిన అన్ని వస్తువులు, సేవల మొత్తం ద్రవ్య విలువను సూచిస్తుంది. ఆర్థికవేత్తలు ప్రధానంగా రెండు విధానాలుగా జీడీపీని లెక్కిస్తారు. ఒకటి, ఉత్పత్తి విధానం. ఇది వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు వంటి వివిధ రంగాల్లో ఆర్థిక కార్యకలాపాల విలువను ప్రతిబింబిస్తుంది. రెండోది, వ్యయ విధానం. ఇది వస్తువులు, సేవలపై మొత్తం ఖర్చును ప్రతిబింబిస్తుంది. భారతదేశ జీడీపీ గణాంకాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా చర్చనీయాంశమవుతున్నాయి. జీడీపీ గణాంక పద్ధతిని, డేటా మూలాధారాలను మార్చడమే అందుకు కారణం. కొత్త పద్ధతి ప్రకారం కార్పొరేట్ రంగం డేటా ఎక్కువగా వచ్చిచేరింది. ఇది వృద్ధి గణాంకాల సవరణను వివాదాస్పదం చేసింది. దీంతో మొత్తం గణాంకాల విశ్వసనీయతపైనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కొత్త విధానం పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు తర్వాత ఏర్పడిన ఆర్థిక మందగమనం విమర్శల నుంచి తప్పించుకోవడానికి కూడా సహాయపడింది.

> **ఈ నేపథ్యంలో 2011-17 మధ్యకాలంలో భారత జీడీపీ వృద్ధి 2-2.5 శాతం ఎక్కువగా చూపించి ఉండొచ్చని ప్రధాని పూర్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం వంటి కొందరు ఆర్థికవేత్తలు చెప్పారు. జీడీపీ గణాంకాలు బ్యాంక్ క్రెడిట్, ఎగుమతి పనితీరు, వేతన వృద్ధి వంటి సూచీలకు వాస్తవ దూరంగా ఉన్నాయని రతిన్ రాయ్, జయతి ఘోష్ వంటి ఆర్థికవేత్తలు కూడా ఆరోపించారు. ఇద్దరు స్వతంత్ర సభ్యులు రాజీనామా చేయడంతో స్టాటిస్టికల్ కమిషన్ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నది.**

భారత్ దాని జనాభా సామర్థ్యంతో పోలిస్తే చాలా తక్కువ పనితీరు కనబరిచింది. కానీ, అందుకు భిన్నంగా చాలా దేశాలు జనాభాను దేశాభివృద్ధికి అనుకూలంగా వినియోగించుకున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పారిశ్రామిక విస్తరణను చేపట్టిన జపాన్ 1970ల నాటికి ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. 1960-90లలో సాంకేతిక, పారిశ్రామిక శక్తిగా దక్షిణ కొరియా రూపాంతరం చెందింది. ఆర్థిక సంస్కరణల తర్వాత

తయారీరంగంలో వృద్ధి సాధించిన చైనా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగింది.

భారత యువ జనాభా నిరుద్యోగంలో, తక్కువ ఉత్పాదకత రంగంలో చిక్కుకుపోయింది. దేశ జనాభాను సక్రమంగా వినియోగించుకొని ఉంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేది. అందుకు సిగ్గుపడాల్సిందిపోయి, నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని గర్వపడుతున్నది. దేశంలోని ప్రజలకు కనీస అవగాహన ఉంటే 'అసలు మన మెందుకు ప్రపంచంలోని నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థ కాలేదు?' అని పాలకులను ప్రశ్నించేవారు. జీడీపీ వృద్ధి ముఖ్యమే. కానీ, అది ప్రజల జీవితాలను మెరుగ్గా మార్చగలిగినప్పుడు మాత్రమే. భారత తలసరి జీడీపీ 2,800 డాలర్లు కాగా, జపాన్ తలసరి జీడీపీ 33,000 డాలర్లు. మానవాభివృద్ధి సూచీలో జపాన్ (19) కంటే భారత్ (132) చాలా వెనుకబడి ఉంది. భారతదేశాన్ని జపాన్‌తో పోల్చడమనేది తప్పు దోవ పట్టించడమే.

వృద్ధాప్య జనాభా ఎక్కువగా ఉన్నా, సున్నా వృద్ధి నమోదవుతున్నప్పటికీ జపాన్ తన పౌరులకు సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, సమర్థవంతమైన మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రతను అందిస్తున్నది. యువ జనాభా, వేగవంతమైన వృద్ధి కలిగిన భారత్ మాత్రం అధిక శిశు మరణాలు, విద్యా వ్యవస్థ వైఫల్యం, అధ్వానమైన ప్రజారవాణా, పోషకాహార లోపంతో ప్రతి రంగంలో వెనుకబడి ఉన్నది.

> **ప్రపంచంలోని అత్యంత అసమాన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశంలోని మొదటి 10 శాతం మంది జనాభా 57 శాతం ఆదాయాన్ని కలిగి ఉన్నది. కింది వరుసలోని 50 శాతం మంది ఆదాయం 13 శాతం మాత్రమే. సంపదపరంగా చూస్తే దేశంలోని ఒక శాతం జనాభా చేతుల్లోనే 40.6 శాతం సంపద పోగై ఉన్నది. కింది వరుసలో ఉన్న సగం జనాభా వద్ద మూడు శాతం సంపద మాత్రమే ఉన్నది.**

2020 నుంచి బిలియనీర్ల సంపద 35 శాతం పెరగగా, అందుకు విరుద్ధంగా ద్రవ్యోల్బణం పేదల జీవితాలను పీక్కుతినేసింది. ఈ జీడీపీ మ్యానియాకు ఇప్పటికే అడవుల నరికివేత, నదుల విషతుల్యం, గ్రామాల వలసలు, నగరాల్లో ఊపిరాడకపోవడం, రైతుల్లో నిరాశ, ప్రజాస్వామ్యం ఖూనీ చేయడం వంటి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇది అభివృద్ధి కానే కాదు, జీడీపీని చూపించి దోపిడీ చేయడమే.

(అవుట్‌లుక్ సౌజన్యంతో...)



మోదీ ఎందుకు తప్పించుకుంటున్నారు?

పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విందుకు ఆహ్వానించారు. ఆ విందు కోసమే జీ-7 సదస్సులో మోదీని కలవకుండానే ట్రంప్ వెళ్లిపోయారు. కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదని విదేశాంగ శాఖ కార్యదర్శి ఎందుకు ప్రకటిస్తున్నారు? ఇదే విషయాన్ని అఖిలపక్షం ముందు, పార్లమెంట్‌లో మోదీ ఎందుకు చెప్పరు? మిస్రీని ముందుకు నెట్టి, మోదీ ఎందుకు తప్పించుకుంటున్నారు?

- జైరాం రమేశ్, రాజ్యసభ సభ్యుడు

తెలంగాణ బీసీ జాబితాలోకి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్న బలిజ, కళింగ, కొప్పుల వెలమ, తూర్పు కాపు, శెట్టిబలిజ తదితర వర్గాల ప్రజలు, వారి తరపున మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులకు నాదొక ప్రశ్న. తూర్పు కాపులను బీసీల్లో చేర్చవద్దని ఆందోళనలు చేసిన మీరు మా తెలంగాణలో బీసీ జాబితాలో వారిని చేర్చాలని ఎలా డిమాండ్ చేస్తారు? 2017 మార్చి 20న అమలాపురంలోని శ్రీరాంపురంలో ప్రస్తుత ఏపీ కార్మిక శాఖ మంత్రి సుభాష్ అధ్యక్షతన బీసీ సంఘాల నేతృత్వంలో ఆందోళనలు జరిగింది నిజం కాదా? కార్మిక శాఖ మంత్రికే కాదు, టీడీపీ, జనసేన, బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలనూ ఇదే ప్రశ్న అడుగుతున్నా.

మా కూడు లాక్కుంటరా?

పాపని నాగరాజు
99488 72190

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ నుంచి చేరాలనుకుంటున్న మీతో పోలిస్తే మా తెలంగాణ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, రాజకీయ, ఉద్యోగపరంగా వెనుకబడిపోయారు. అందుకే మీ మూలంగా తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ, యువతకు, మొత్తంగా తెలంగాణ ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతున్నదనే కారణంగా తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకున్నది. స్వరాష్ట్రం ఏర్పడింది. 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదమంటే అన్ని రకాల వనరులు అని అర్థం.

2016లో ఏపీ బీసీ జాబితాలోని ఏడు తెలంగాణ బీసీ కులాలను తొలగించారు. మీరు మీ రాష్ట్రంలో మా తెలంగాణ బీసీ కులాలను ఉంచి, ఇక్కడ డిమాండ్ చేయడంలో ఒక అర్థముంటుంది. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో దళిత, బీసీ, గిరిజన, మైనారిటీల పేరుతో చాలామంది దొడ్డిదారిన చేరిపోయారు. కల్మష మెరుగని తెలంగాణ ప్రజలను ఈ విధంగా మోసం చేయడం న్యాయమా? మీ చేరిక వల్ల బీసీల విద్యకు తీవ్రమైన ఆటంకం కలుగుతుంది. జాతీయ/రాష్ట్ర విద్యాసంస్థల్లో సీట్లన్నీ మీ విద్యార్థులే తన్నుకుపోతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలోనూ తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుంది. ఇప్పుడు తెలంగాణలో చేరాలనుకుంటున్న కళింగ, వెలమ, రెడ్లు, కమ్మ సామాజిక వర్గాలు క్రీ.శ.1323-1724 మధ్యకాలంలో ఆంధ్రా ప్రాంతంలో రాజ్యాలు ఏలినవే. చారిత్రక క్రమంలో దొడ్డిదారిన వీళ్లు వివిధ కులాల పేర, ఇంటి పేర లేదా వృత్తి పేరిట బీసీల్లో చేరిపోయారు.

ఉద్యోగాలే కాదు, రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ పదవులనూ వారు ఎత్తుకుపోయే అవకాశం లే